క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 51వ డివిజన్ కపాడిపాళెనికి చెందిన కల్లూరి సునయన 50 మందితో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. కపాడిపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఖలీల్‌అహ్మద్ వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముస్లిం రిజర్వేషన్లపై చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి

- కనుమూరి రవిచంద్రారెడ్డి



కనుమూరి రవిచంద్రారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): 'మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కొనసాగిస్తామని ప్రకటించారు. రిజర్వేషన్లను చంద్రబాబు సమర్థిస్తారో లేక వ్యతిరేకిస్తారో స్పష్టత ఇవ్వాలి' అని వైఎస్సార్‌సీపీ కేంద్ర అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రకటించిందని, 2019లో వచ్చిన ఈ చట్టాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని చెప్పింది కూడా ఎన్‌డీఏ ప్రభుత్వమేనని తెలిపారు. ప్రజలు తమకు ఓట్లేయరనే నిరాశతో చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు ఈసీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయమై చంద్రబాబు, లోకేశ్‌లపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఐదేళ్లుగా కనిపించని జర్నలిస్ట్ రవిప్రకాష్ పొలిటికల్ స్టడీ పేరుతో కచ్చితమైన గణాంకాలు లేకుండా తనకు నచ్చిన విధంగా రిపోర్టులు ప్రకటిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు రవిప్రకాష్ స్టడీ, ప్రశాంత్‌కిషోర్‌లను నమ్ముకుని అధికారం వస్తుందని అపోహలో ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు సజావుగా కొనసాగుతాయని ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారని తెలిపారు.

విద్యుత్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఈఈ సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగర విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను పరిష్కరించుకునేందుకు విద్యుత్ సంస్థ ఏర్పాటు చేసిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ సేవలను వినియోగించుకోవాలని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి సూచించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో ఉన్న ఆయన చాంబర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబరుతోపాటు 91333 31912 నంబర్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే నగరంలోని 12 విద్యుత్ సెక్షన్ల కార్యాలయాలకు సంబంధించిన 12 ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏకే నగర్ విద్యుత్ సెక్షన్ – 94906 15250, బీవీనగర్ సెక్షన్ – 94910 44672, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్ – 94906 15251, టౌన్‌హాల్ సెక్షన్ – 94408 32324, హరనాథపురం సెక్షన్ – 94906 15258, స్టోన్‌హౌస్‌పేట సెక్షన్ – 83329 87174, కిసాన్‌నగర్ సెక్షన్ – 94906 15256, రామూర్తినగర్ సెక్షన్ – 94906 15257, వెంకటేశ్వరపురం సెక్షన్ – 73826 00106, డైకస్ రోడ్డు సెక్షన్ – 94906 11544, రాజేంద్రనగర్ సెక్షన్ – 94906 15253, కోటమిట్ట సెక్షన్ – 8333 900474 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఐదుగురి అరెస్ట్

పొదలకూరు: మండలంలోని విరువూరు రైసు మిల్లులో ఇటీవల లభ్యమైన మద్యం బాటిళ్ల కేసులో పొదలకూరు సెబ్ అధికారులు ఐదుగురు వ్యక్తులను ఆదివారం అరెస్ట్ చేశారు. సెబ్ సీఐ వెంకట్రావు కథనం మేరకు.. రైసుమిల్లులో లభ్యమైన మద్యం బాటిళ్లను తాటిపర్తి, సూరాయపాళెం మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసినట్లుగా తేలడంతో అక్కడ పని చేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు విజయరామిరెడ్డి, వెంకటవినోద్‌కుమార్, అనిల్, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణను అరెస్ట్ చేశారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

సంగం : వడదెబ్బతో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని మక్తాపురంలో శనివారం రాత్రి జరిగింది. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. మక్తాపురానికి చెందిన రమణమ్మ (65) శనివారం పనినిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం వెళ్లారు. ఎండలో వెళ్లి ఇంటికి రావడంతో వడదెబ్బకు గురై మృతి చెందారు.

విక్రమ్‌నగర్‌ను అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ప్రజలు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 27వ డివిజన్ విక్రమ్ నగర్‌ను జూబ్లీహిల్స్ తరహాలో అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. విక్రమ్‌నగర్‌లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి సన్నపరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్థానికుల ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. తన 25 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏనాడూ ఇచ్చిన మాట తప్పలేదని, తన పైన ఇప్పటివరకు ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవని, తాను ఇతరులను ఇబ్బందులకు గురి చేయలేదని తెలిపారు. ఎవరినీ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టలేదని, వ్యక్తులు, ప్రాంతాల మధ్య వివాదాలు, గొడవలు పెట్టే అలవాటు తనకు లేదని తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహించిన ఆయా ప్రాంతాల అభివృద్ధిని మాత్రమే ఆకాంక్షిస్తానని తెలిపారు. కరోనా సమయంలో ప్రజల అవసరాల నిమిత్తం కలెక్టర్‌కు రూ.25 లక్షల విరాళం అందజేశామని, అలాగే మరో రూ.25 లక్షలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షితంగా మన ప్రాంతానికి తీసుకొచ్చేందుకు, ఇక్కడ ఉన్న ఇతర ప్రాంతాల ప్రజలను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైవీ రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి లంక రామశివారెడ్డి, 26వ ఇన్‌చార్జి షేక్ బాబు, సుధాకర్‌రెడ్డి, నాయకులు రొంపిచర్ల సుబ్బారెడ్డి, పుల్లూరు చంద్రమౌళి, ఇక్బాల్, రమణరాజు, విక్రమ్‌నగర్ ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్‌అహ్మద్

- ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల సంక్షేమ పథకాలను అందించిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ తెలిపారు. నగరంలోని 10వ డివిజన్ ఉస్మాన్‌సాహెబ్‌పేట రోడ్డు, పిండిమిల్లు సెంటర్, కోదండరామపురం, బాబు గిరిజనకాలనీ, 53వ డివిజన్ గిరిజనకాలనీ, వారధిసెంటర్, షుగర్ ఫ్యాక్టరీ రోడ్డు, 3వ డివిజన్ దీనదయాళ్‌నగర్, చెంచువారి కాలనీ, 51వ డివిజన్ పెద్దబావివీధి, బందిలివారి వీధి, రచ్చమానువారివీధి, తమిళవీధి, బండివారివీధి తదితర ప్రాంతాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో నెల్లూరు నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. నాలుగున్నరేళ్లుగా కనిపించని మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఎన్నికల సమయంలో వచ్చి ఏవేవో హామీలు ఇస్తున్నారని, అయితే ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కిన్నెర ప్రేమ్‌కుమార్, సంక్రాంతి అశ్విని, కాయల సాహిత్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బాగి వెంకటరమణ, వెంగళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాలతోనే నెల్లూరు రూరల్ అభివృద్ధి



దొంతాలిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న స్వర్ణా వెంకయ్య తదితరులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి ఆదాల ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వర్ణా వెంకయ్య అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దొంతాలి పంచాయతీ ఎస్సీకాలనీల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా వెంకయ్య, ఆనంద్, వెంకట్రావ్, శ్రీనివాసులు, పాలకీర్తి రవి, నవీన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సురేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కవి నరేంద్రకు సన్మానం



నరేంద్రను సన్మానిస్తున్న సాహితీ గోదావరి సంస్థ నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): స్థానిక గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వర్ధమాన కవి మక్తాల నరేంద్రకు రాజమహేంద్రవరంలో ఘనంగా సన్మానం జరిగింది. కొడవలూరు మండలం నార్తురాజుపాళెం హైస్కూలులో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆయన రాజమహేంద్రవరానికి చెందిన సాహితీ గోదావరి సంస్థ నిర్వాహకులు ఇటీవల నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఉగాది కవితల పోటీల్లో ప్రథమ బహుమతి పొందాడు. ఆదివారం అక్కడి కోదండరామస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన కవికోకిల పుస్తకావిష్కరణ సభలో నరేంద్రకు ఉగాది పురస్కారంతోపాటు నగదు బహుమతి అందజేసి సన్మానించారు.

చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు

- నగర మేయర్ స్రవంతి



కరపత్రం అందజేస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): పింఛన్ల కోసం అవ్వాతాతలు మండుటెండలో అవస్థలు పడుతున్నారని, తమ రాజకీయ ప్రయోజనాల కోసం పింఛన్ల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబునాయుడికి వారి ఉసురు తగలక మానదని నగర మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం కాకుపల్లి గ్రామంలోని నందమూరినగర్ గిరిజనకాలనీలో ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి గడపలో ప్రచారానికి వెళ్తుంటే తమకన్నా ముందు ప్రజలే మా ఓటు ఫ్యాన్ గుర్తుకే అంటుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు పొందిన వారు ఉన్నారని తెలిపారు. ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా పెన్షన్ రావాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, వారిని గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రమణయ్య, శేషు, మధు, నరేష్, వంశీ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

నవ్వుతో ఆరోగ్యం, దీర్ఘాయుష్షు



మాట్లాడుతున్న లాఫింగ్ క్లబ్ నేతలు

నెల్లూరు(అర్బన్): నవ్వు ఆరోగ్యానికి ఎంతో మంచిదని, అంతేకాకుండా దీర్ఘాయుష్కులు కాగలరని జిల్లా జైల్స్ అధికారి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వీఆర్‌సీ గ్రౌండ్‌లో వీఆర్‌సీ గ్రౌండ్ వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నవ్వడం వల్ల పలు రకాల మానసిక రుగ్మతలు కూడా తగ్గిపోతాయన్నారు. లాఫింగ్ క్లబ్ సెక్రటరీ, ఉద్యోగ సంఘాల(జేఏసీ) రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ నవ్వడం ద్వారా నరాలపై ఒత్తిడి తగ్గి బీపీ, షుగర్ నియంత్రణలో ఉంటాయన్నారు. హాస్య యోగా గురువు వెంకురెడ్డి ఆధ్వర్యంలో వివిధ రకాలుగా నవ్వులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. బి.సుబ్బారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, లాఫింగ్ క్లబ్ గౌరవాధ్యక్షుడు, అడ్వకేట్ నన్నే సాహెబ్, నాయకులు ప్రసాద్, డాక్టర్ భాస్కర్‌రావు, పర్వీన్, సౌకత్‌హుస్సేన్, అడ్వకేట్ రమాదేవి, పిరమిడ్ ధ్యాన మందిరం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అభినయ ఆర్ట్స్ దశమ వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఆదివారం రాత్రి 'అభినయ ఆర్ట్స్' దశమ వార్షికోత్సవం ఆ సంస్థ అధ్యక్షుడు, దర్శకుడు, నటుడు సీఆర్ రాఘవ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని, సీఆర్ రాఘవ సతీమణి సులోచనమ్మ వర్ధంతి, సంస్మరణసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పీఎల్ నరసింహారావు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి విద్యాదానం చేసి మహనీయులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనంతరం నిర్వహించిన సంగీత, నృత్య పోటీల్లో విజేతలైన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి అలరించాయి. ఈ సందర్భంగా ప్రముఖ నాటక రచయిత పులుగుండ్ల రామకృష్ణయ్య రచించిన 'తుపాను' నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖులు తుంగా నారాయణరెడ్డి, కేతా సుబ్బారావు, ఎ.జయప్రకాష్, ఎన్వీ రమణయ్య, మురళీకృష్ణ, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పురోహిత సంఘం మద్దతు



ద్వారకానాథ్‌తో బ్రాహ్మణ పురోహిత సంఘం నేతలు

నెల్లూరు(బృందావనం): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తమ సంపూర్ణ మద్దతు అందించనున్నట్లు బ్రాహ్మణ పురోహిత సంఘం నాయకులు ప్రకటించారు. నగరంలోని నవాబుపేటలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌ను ఆదివారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు బ్రాహ్మణ సంఘీయుల కోసం అగ్రహారం, కమిటీ హాల్, గుర్తింపుకార్డులు అందజేయాలని కోరుతూ ద్వారకానాథ్‌కు వినతిపత్రం అందజేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ద్వారకానాథ్‌ను ఘనంగా సత్కరించి వేద ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పారా శ్రీధర్‌శర్మ, కార్యదర్శి ఆత్మకూరు కిరణ్‌కుమార్ శర్మ, శనగరవపు శ్రీనివాసులుశర్మ, కె.శ్రీనివాసులు శర్మ, నక్కా రామమూర్తిశర్మ, జశ్వంత్‌శర్మ, కార్తీక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం



దాతలు అందజేసిన సామగ్రితో ఆశ్రమ విద్యార్థినులు

నెల్లూరు(బృందావనం): మానవత్వం, సేవాభావంతో 'మానవసేవే మాధవసేవ' బృందం సభ్యులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. నగరంలోని కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్‌లోని జనహిత–వాత్సల్య నిరాదరణ బాలల, వృద్ధుల కేంద్రంలో ఆశ్రమ విద్యార్థులకు విశ్రాంత డిస్ట్రిక్ట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ వారణాసి శేషగిరిరావు ఆదివారం పుస్తకాల కోసం రూ.25 వేల నగదును చెక్ రూపంలో అందజేశారు. అలాగే విద్యార్థులందరికీ పాదరక్షలు, నిత్యావసర సరుకులు, తినుబండారాలు ఆశ్రమ కార్య నిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావుకు అందజేశారు. ఈ సందర్భంగా చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ శేషగిరిరావు అందించిన సాయం అభినందనీయమన్నారు. అలాగే 'మానవసేవే మాధవసేవ' బృందం నిర్వాహకురాలు అరవ పరిమళ సభ్యుల సహకారంతో కాస్మొటిక్స్ అందజేశారు. కార్యక్రమంలో జీవీ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభం



ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో సాగుతున్న పోస్టల్ ఓట్ల ప్రక్రియ

ఆత్మకూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఆత్మకూరు ఆర్వో, ఆర్డీఓ కె.మధులత నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పోస్టల్ ఓట్ల ప్రక్రియలో పట్టణంతో పాటు మండలాలకు చెందిన పలువురు ఎన్నికల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ఓట్లు నమోదు చేశారు. కాగా ఓటర్లు కాకుండా ఇతరులు లోపలికి వెళ్తున్నారని, పోటీ చేసే అభ్యర్థితో మరో ముగ్గురు పక్కనే వెళ్తుండడంపై జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అభ్యంతరం తెలిపారు. ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె పోటీ చేసే అభ్యర్థి, ఓటర్లు మాత్రమే లోపలికి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన ప్రక్రియ సాయంత్రం 7.30 గంటల వరకు కొనసాగింది.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు హయాత్‌బాషా

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్రం అవలంభించబోతున్న యూసీసీ చట్టానికి వైఎస్సార్‌సీపీ వ్యతిరేకమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు సభలో ప్రకటించడం హర్షనీయమని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవడం మనందరి బాధ్యత అని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు హయాత్‌బాషా పేర్కొన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మైనారిటీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులమతాలు, రాజకీయాలు చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేదల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కొనసాగిస్తామని నెల్లూరు సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కర్తం ప్రతాప్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం బాలాజీనగర్ ప్రాంతంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను గెలిపించాలని కోరారు.

కళాకారుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న రేబాల శ్రీలక్ష్మి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటైన సింహపురి పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘానికి మంచి భవిష్యత్ ఉంటుందని రేబాల శ్రీలక్ష్మి అన్నారు. నగరంలోని డాక్టర్ జీవీకే మెమోరియల్ నెల్లూరు హాస్పిటల్‌లో ఆదివారం సింహపురి పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కళాకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భద్రాచలం బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రేబాల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లా కళాకారులందరూ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని మండలాలకు కమిటీలను ఏర్పాటు చేసి సంక్షేమ సంఘం నిధి, కళాకారులకు గుర్తింపుకార్డులు, సంఘం రిజిస్ట్రేషన్, కార్యాలయం, సభ్యత్వం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో చక్రపాణి, హరనాథరెడ్డి, రామకృష్ణ, తిరుపాల్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచురామయ్య, అపర్ణ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 2,419 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కేంద్రాన్ని ఆర్వో వికాస్ మర్మత్ పరిశీలించారు. ఈ నెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

తొలి రోజు 812 ఓట్లు

నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించి తొలి రోజు 812 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 33.56 శాతం ఓటింగ్ నమోదైంది.

జనరల్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి **మెదరమెట్ల మాలకొండయ్య గారి కుమారుడు మెదరమెట్ల చంద్రశేఖర చౌదరి గారు రిజిష్టరు విక్రయ పత్రము నెంబరు 6747/2000 తేది 29.09.2000** ద్వారా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ : శ్రీ తలపగిరి రంగనాథ స్వామి వారి వద్ద నుండి కొనుగోలు చేసినారని, సదరు **చంద్రశేఖర చౌదరి** గారు దగ్గర నుండి **గునపాటి శివకోటారెడ్డి గారి భార్య గునపాటి శ్రీలత గారు** ఈ సదరు ఆస్తిని **రిజిష్టరు విక్రయ పత్రము నెంబరు 16743 / 2007, తేది 24.09.2007** ద్వారా కొనుగోలు చేసినారని సదరు **గునపాటి శ్రీలత** గారికి పూర్తి హక్కులతో అనుభవించుకొన్నారని చెప్పుచున్నారు. ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి నా కక్షిదారునికి అమ్మచూపినారు. ఈ ఆస్తికి సంబంధించి ఎవరికైనా ఎలాంటి హక్కులు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల నాకు తెలుపుకొనవలసినది. లేనిచో ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని నా కక్షిదారుడు కొనుగోలు చేయగలవారలు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా,నెల్లూరు సబ్ రిజిస్ట్రార్, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, కొండాయపాళెం, సర్వేనెం. 95/2ఎ రు యి,1-14 సెంట్లు భూమికి **హద్దులు :- తూర్పు:** కాలువ, **దక్షిణం:** కమతము మల్లికార్జునరెడ్డి భూమి, **పడమర :** సర్వేపల్లి కాలువ, **ఉత్తరం :** వాకాటి సుబ్బరామిరెడ్డి భూమి.

కొండూరు శేషారెడ్డి, బి.కామ్.,బి.ఎల్.,
అడ్వకేట్,
బాలాజీ నగర్, నెల్లూరు నగరం. సెల్ నెం. : 94402 77290.